క్లుప్తంగా

ఉరుములకు టీవీలు, ఫ్యాన్‌లు దగ్ధం

దొనకొండ: మండలంలో బుధవారం అర్ధ రాత్రి ఉరుములు, మెరుపులు భయకరంగా వచ్చాయి. మండలంలోని ఇండ్లచెరువులో మెరుపుల ధాటికి సుమారు 25 ఫ్యాన్‌లు, 30 టీవీ సెటాప్ బాక్స్‌లు, 20 టీవీలు దగ్ధమయ్యాయి. టీవీలు, ఫ్యాన్‌లు దగ్ధం కావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

డీప్‌బోర్‌కు మరమ్మతులు



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

దొనకొండ: మండలంలోని యర్రబాలెం ఎస్సీ కాలనీలో కొన్ని రోజుల నుంచి డీప్ బోర్ మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు పంచాయతీ వారికి ఎన్ని సార్లు తెలిపినా పట్టించుకోలేదు. ఎంపీడీఓ ఎం.శ్రీదేవిని, ఏఓఎస్ దావూద్‌ను బుధవారం కలిసి తమకు మంచి నీటి సమస్య ఉందని, డీప్‌బోర్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.డేవిడ్ మరమ్మతులకు గురైన డీప్‌బోర్‌కు నూతన బోర్ బిగించి నీరు సరఫరా చేశారు. నీటి సమస్యను పరిష్కరించటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కురిచేడు: మండలంలోని ఎన్ఎస్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన ఆవులమంద చిన్న పిచ్చయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐదేళ్ల పాప గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తోంది. సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత పాప ఇంటికి వెళ్తోంది. చాక్లెట్ ఇస్తానని బాలికను చిన్న పిచ్చయ్య ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ పాప ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తన తల్లిదండ్రులకు విషయం తెలపడంతో పాప తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చిన్న పిచ్చయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు.

బంగారం షాప్‌లో చోరీ

యర్రగొండపాలెం: స్థానిక నగల దుకాణంలో చోరీకి యత్నించిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం శ్రీసీతారామ జ్యూయలరీ షాపులో వెండి పట్టీలు కొనుగోలు చేయటానికి పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మహిళ వెళ్లింది. అక్కడ పట్టీలు పరీక్షిస్తూ 5 జతల వెండి పట్టీలను దాచుకుంది. ఈ విషయం తెలుసుకున్న షాపు యజమాని ఆమె నుంచి పట్టీలు స్వాధీనం చేసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రంగంలోకి దిగిన పోలీసులు మహిళా దొంగను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు

- ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా తీర్మానాలు
- వివాదాస్పద స్థలంలో నిర్మాణాలు
- ఆక్రమణలు ఆపాలంటున్న ప్రజలు



సత్రం బావి స్థలంలో నిర్మాణం

కురిచేడు: ప్రభుత్వ స్థలం అయితే చాలు ఆక్రమణకు తెరతీయడమే పనిగా కొందరు పెట్టుకున్నారు. స్థానిక సెంటర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం పక్కన ఉన్న సత్రం బావి స్థలం విషయంలో గ్రామ పంచాయతీకి, ఆలయ ట్రస్టు మధ్య వివాదం నడుస్తోంది. ఇరుగ్గాలు ఆ స్థలం తమదంటే తమదని హైకోర్టుకు వెళ్లారు. ఇంకా అక్కడ ఎటువంటి నిర్ధారణ జరగలేదు. అయినా ఆ స్థలంలో నిర్మాణాలు జరుపుతున్నారు. ఆలయం పక్కన ఉన్న గదుల విషయంలో దర్శి కోర్టులో గ్రామస్తుడు మేరువ పెద్దిరెడ్డి కేసు వేశారు. ఆ కోర్టు ఆదేశాల మేరకు కొన్ని గదులను ఏడాది క్రితం స్వాధీనం చేసుకున్న పంచాయతీ అధికారులు నేటికీ వాటి అద్దెలను పంచాయతీకి రాబట్టలేక పోతున్నారు. మిగిలిన గదుల విషయం ఏమిటని పెద్దిరెడ్డి సమాచార చట్టం ద్వారా పంచాయతీ అధికారులను కోరారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు అన్యాక్రాంతం చేస్తున్న వారితో కుమ్మక్కై కోట్లాది రూపాయల ఆస్తులను పంచాయతీకి దక్కకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దర్శి రోడ్డులోని మార్కెట్ కమిటీ యార్డు ముందు వైపు ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురవుతోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా వాటిని బేఖాతర్ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఒకే స్థలంలో ఇద్దరికి నిర్మాణాలు చేసుకునేలా తీర్మానం ఇచ్చారని, ఆ తప్పు తెలుసుకుని పంచాయతీ మెంబర్లు ఆ తీర్మానం రద్దు చేయాలని కలెక్టరుకు, గ్రామ పంచాయతీకి వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకుని క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి, ఆ భూములను ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోని రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నాడు.

త్వరలో చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమణ జరిగింది వాస్తవమే. కన్యకాపరమేశ్వరి ఆలయం పక్కన కొన్ని గదులను స్వాధీనం చేసుకున్నాం. మిగిలిన వాటిని స్వాధీనం చేసుకుంటాం. సత్రం బావి స్థలంలో నిర్మాణాలు జరగకూడదు. పరిశీలించి కేసులు పెడతా. పంచాయతీ స్థలంలో ఆలయానికి నిర్మాణం చేసుకునేలా పంచాయతీ తీర్మానం ఇవ్వకూడదు. గతంలో ఇచ్చారు. దానిపై న్యాయ సలహా తీసుకుని చర్యలు చేపడతాం. కోర్టులో వివాదాస్పదంగా ఉన్న స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. చర్యలు తీసుకుంటా. ఏఎంసీ ముందు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తాం.

– చాంద్‌బీ, పంచాయతీ కార్యదర్శి



పెద్దదోర్నాలలో దీపావళి సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు



వై.చర్లోపల్లిలో గోవులను పరిగెత్తిస్తున్న సుగాళీలు

అంగరంగ వైభవంగా దీపావళి పర్వదినం

- లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు
- వై.చర్లోపల్లిలో గోవులను పరిగెత్తించిన సుగాళీలు
- దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి: నియోజకవర్గంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు తమ నివాసంలో దీపావళి వేడుకలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో దీపావళి సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ముంగిళ్లలో దీపాలు వెలిగించి తమ ఆనందం వెలిబుచ్చారు.

పెద్దదోర్నాల: దీపావళి సంబరాలను మండల ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. నరక చతుర్దశి, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు వీధులు బాణసంచా మోతలతో దద్దరిల్లాయి. కళ్లు మిరుమిట్లు గొలిపే చిచ్చుబుడ్లు, నింగిలోకి దూసుకెళ్తున్న తారాజువ్వలు, వెలుగు జిలుగుల రంగుల రంగేళిలతో దీపావళి పర్వదినాన్ని ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. దీపావళి పర్వదినాన ప్రతి ఒక్కరూ ధన లక్ష్మీదేవి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటింటా ప్రమీదలతో దీపాలు వెలిగించి చిన్న, పెద్ద వయో బేధం లేకుండా టపాసులు కాల్చుతూ దీపావళి సంబరాలు జరుపుకున్నారు. వేకువ జామునే భక్తులు స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



టపాసులు కాలుస్తున్న యువకుడు



ఆకాశదీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

గోవులకు పూజలు

మండల పరిధిలోని వైచర్లోపల్లిలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని గ్రామంలో మూడు పర్యాయాలు పరిగెత్తించే వింత ఆచారాన్ని సుగాళీలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం నరక చతుర్దశి రోజు తమ ఆచారం ప్రకారం మాంసాహారంతో విందు నిర్వహించుకున్నారు. అనంతరం శుక్రవారం గ్రామంలోని గోవులన్నింటినీ ఒకచోట చేర్చి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం టపాసులు కాల్చుకుంటూ గ్రామం పొలిమేర వరకు మూడు పర్యాయాలు గోవులను తిప్పుతారు. ఈ ఆచారం ఎన్నో ఏళ్లుగా గ్రామంలో జరుగుతుందని, అలా చేయటం వల్ల గ్రామంలోకి ఎటువంటి దుష్టశక్తులు ప్రవేశించకుండా గోవులు గ్రామానికి కాపలాగా ఉండాయన్న నమ్మకంతో ఈ కార్యక్రమం నిర్వహించుకుంటామని కొందరు సుగాళీలు తెలిపారు.

దొనకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్దలు, పిల్లలు, మహిళలు గురువారం ఘనంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. మహిళలు ఇళ్లల్లో దీపాలు అలంకరించి సాయంత్రం వేళ కుటుంబ సమేతంగా ఆనందంతో టపాసులు కాల్చారు. చిన్నారులు ఒకరినొకరు పోటీ తత్వంతో టపాసులు కొనుగోలు చేసి ఆనందంలో మునిగిపోయారు. వచ్చే ఏడాది గొప్పగా జరుపుకుందామంటూ చిన్నారులు ఒకరినొకరు హాయ్ చెప్పుకుని బజారు నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు.

పింఛన్‌ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు



కురిచేడు పంచాయతీలో పింఛన్ కోసం వేచి చూస్తున్న వృద్ధులు



పింఛన్ కోసం వచ్చి నిద్రపోతున్న వృద్ధుడు

కురిచేడు: ప్రతి నెలా 1వ తేదీ ఠంచన్‌గా పింఛన్ గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ సిబ్బంది రెండు రోజుల పాటు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. పింఛన్లు పంపిణీ చేయక పోవడంతో పింఛన్‌దారులు నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. సర్వర్‌తో పాటు పంచాయతీ సిబ్బంది కొందరు బదిలీపై రావడంతో వారికి పింఛనుదారుల అడ్రసులు తెలియక ఎక్కడకు వెళ్లి పంపిణీ చేయాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. తాళం వేసితిని, గొళ్లెం మరిచితిని అన్న చందంగా ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయమని, ప్రజా ప్రతినిధులు ఫొటోలకు ఫోజులిచ్చారేగానీ సర్వర్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోక పోవడంతో పెన్షను కష్టాలు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం సర్వర్ రావడంతో సిబ్బంది పింఛన్ల పంపిణీని మొదలు పెట్టారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

కురిచేడు: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం మండలంలోని ఆవులమంద బాప్టిస్ట్ చర్చిలో బిషప్ ఎం.కిరణ్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దర్శి రిజియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ జి. కృపానందం మాట్లాడుతూ ఐక్యత దైవిక చిత్తమని పేర్కొన్నారు. సహోదరులు ఐక్యత కలిగి జీవించుట ప్రతి ఒక్కరూ అలవర్చుకొని ప్రభువు ఉద్దేశాలను నెరవేర్చాలని ఆయన పిలుపునిచ్చారు. యూనియన్‌లో సభ్యులందరూ సమానమైన గౌరవ హక్కులు కలిగి ఉంటారని కార్యదర్శి ఎం.ఏసన్న తెలిపారు. అనంతరం నూతన కమిటీని నియమించారు. మండల యూపీఎఫ్ అధ్యక్షుడిగా రెవ డి.లాజరస్, గౌరవ అధ్యక్షుడిగా బిషప్ ఎం. కిరణ్‌బాబు, ట్రెజరర్‌గా ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా జి. వెంకట్రావు, చీఫ్ అడ్వయిజర్‌గా ఫాదర్ రాయన్న, జె. రవికుమార్, ఎం.స్టాలిన్ పాల్, కె.షాలేంరాజ్, ఎం. తిమోతి, కె.కిరణ్, కార్యవర్గ సభ్యులుగా వై.హనోక్, బి.జేమ్స్, సీహెచ్ లక్ష్మయ్య, బి.త్రిపురయ్యలను ఎంపిక చేశారు. దర్శి రీజియన్ నాయకులు ఆర్.డేవిడ్, జి. రాజారత్నం, జి.నిమ్మేష్, వై.ఆశీర్వాదం, పి.ప్రభాకర్, జేకే రావ్, సాల్మన్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో రీజియన్ నాయకులు

వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు కోట మృతి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట వెంకటరెడ్డి శుక్రవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, రెడ్డి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు బిజ్జం రమణారెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్రెడ్డి వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

పొట్టి శ్రీరాములుకు నివాళి

యర్రగొండపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములుకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. మండల విద్యావనరుల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘాలకు చెందిన నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.



వై.పాలెంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమం తప్పదు



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రమేష్‌బాబు

ముండ్లమూరు (దర్శి): విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమం తప్పదని సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్‌బాబు హెచ్చరించారు. సీపీఐ మారెళ్ల శాఖ సమావేశం మట్టా శరభారెడ్డి భవన్‌లో డాకా కన్నారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ అసలే నిత్యావసరాల ధరలు, పెట్రోల్ ధరలు పెరిగి వరదలు వచ్చి ప్రజలు అల్లాడుతుంటే సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూడు సంవత్సరాల సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.6072 కోట్ల అదనపు భారం వేసి వసూలు చేయడానికి అనుమతి ఇవ్వడం వాగ్దానానికి పూర్తి విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి నీరు నింపి దిగువకు విడుదల చేయాలన్నారు. దీనివల్ల పశ్చిమ ప్రకాశం కరువు తగ్గుతుందని, వ్యవసాయ ఉపాధి కలుగుతుందన్నారు. మండల కార్యదర్శి సుంకర అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, వాగులు, బ్రిడ్జిలు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు బోడాల వీరాంజనేయులు, జూపల్లి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, ఎర్రిబోయిన కోటయ్య, మట్టా మహాలక్ష్మమ్మ, సుంకర సుజాత పాల్గొన్నారు.

సచివాలయాలకు తాళాలు



పసుపుగల్లు సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధుడు



పింఛన్ కోసం అంధురాలిని సచివాలయానికి తీసుకెళ్తున్న బంధువు

- పింఛన్ పంపిణీ పేరుతో విధులకు డుమ్మా
- సచివాలయాలకు వచ్చి వెళ్తున్న వృద్ధులు
- గందరగోళంగా పింఛన్‌ల పంపిణీ

ముండ్లమూరు (దర్శి): పింఛన్‌ల పంపిణీ పేరుతో సచివాలయాలకు తాళాలు వేసి సచివాలయాల్లో ఒక్క అధికారి కూడా లేకుండా డుమ్మా కొట్టారు. దర్శి నియోజకవర్గంలోని దర్శి, ముండ్లమూరు మండలాల్లో సచివాలయాలకు పింఛన్‌లు పంపిణీ పేరుతో తాలాలు వేసి అధికారులు సచివాలయం సేవలు నిలిపివేశారు. అయితే సచివాలయాలకు పింఛన్‌లు కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు సమాధానం చెప్పే వారు లేక వేచి వేచి నిరాశతో ఇంటి ముఖం పట్టడమే వారి వంతైంది. తమకు ఇంటి వద్ద పింఛన్‌లు ఇవ్వలేదని సచివాలయం వద్దకు వస్తే అక్కడ తాళాలు వేసి ఉన్నారని పింఛన్‌దారులు వాపోయారు. ముండ్లమూరు మండలం పసుపుగల్లు సచివాలయం సిబ్బంది తాము ఎండకు రాలేమని సచివాలయానికి వచ్చి తీసుకెళ్లాలని పింఛన్‌దారులకు తెలిపారు. దీంతో పింఛన్‌దారులు ఎండకు వృద్ధులను, కళ్లు లేని వారిని తీసుకెళ్లి సచివాలయంలో పింఛన్‌లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అక్కడకు వెళ్లినా అధికారులు లేక సమాధానం చెప్పేవారు లేక ఎప్పుడు వస్తారో తెలియక సచివాలయం ముందు పడిగాపులు కాసి నిరాశతో వెనుదిరిగి పోతున్నారు. పులిపాడు సచివాలయంలో సచివాలయానికి తాళం వేశారు. దర్శి పట్టణంలోని నాలుగు సచివాలయాలకు తాళాలు వేయడం గమనార్హం. పింఛన్‌లు పంచేందుకు మధ్యాహ్నం వరకు సర్వర్‌లు పని చేయడం లేదని, సాయంత్రం వరకు పింఛన్‌లు పంచుతూనే ఉన్నామని, అందుకే తాళాలు వేశామని కొన్ని సచివాలయాలకు, సిబ్బంది లేరని మరి కొన్ని సచివాలయాలకు తాళాలు వేసినట్లు అధికారులు చెప్తున్నారు.



పులిపాడులో తాళం వేసిన సచివాలయం



దర్శిలో తాళం వేసిన సచివాలయం

ఘనంగా పటేల్ జయంతి



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్సై మల్లికార్జున్ ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడితో ప్రజల భయాందోళన

కురిచేడు: గ్రామంలో కుక్కల దాడి రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇటీవల కాలంలో సుమారు 15 మంది వరకు కుక్కల దాడిలో గాయపడ్డారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బూదాల జాను ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆ పాప ఎడమకాలు పూరిగా రక్త గాయాలయ్యాయి. ఆ దారిన వెళ్తున్న వారు గమనించి కుక్కదాడి నుంచి పాపను కాపాడినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. పెద్దలు పనులకు వెళ్తున్న తరుణంలో ఒంటరిగా ఉన్న చిన్నారులపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇటీవల కుక్కలను పట్టుకున్న సమయంలో కొందరు తమ కుక్కలను దాచిపెట్టారు. కుక్కలు ఉన్న వారికి నోటీసులు ఇచ్చి వాటిని ఇళ్ల వద్ద కట్టేసుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన బాలిక జాను